

జ్యోతిక్షేత్రానికి బస్సు సర్వీసులు పునరుద్ధరణ

ప్రజాశక్తి-కాశినాయన

కడప, కాశినాయన జ్యోతి క్షేత్రానికి ఆర్టీసి బస్సు సర్వీసులను పునరుద్ధరించామని, ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం అటవీశాఖాధికారులు జ్యోతిక్షేత్రానికి బస్సుల రాకపోకలను నిలిపేసిన విషయం తెలిసిందే. దీంతో యాత్రికులు, స్థానికులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ స్పందించి యాత్రికులకు అసౌకర్యం కలగకుండా అటవీశాఖాధికారులతో చర్చించి బస్సు సర్వీసులను పునరుద్ధరించారు. జ్యోతి క్షేత్రానికి బస్సులు యథావిధిగా నడుస్తాయని పేర్కొన్నారు. ప్రయాణికుల సౌలభ్యం దృష్ట్యా త్వరితగతిన ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు.

అడ్డంకుల్లో అన్నదాత సుఖీభవ

- కడపలో 1,626 మందికి మొండిచేయి
- అన్నమయ్యలో 5,937 మందికి తిరస్కృతి
- రెవెన్యూలో ఆన్‌లైన్, ఇకెవైసి అడ్డంకులు
- పట్టని రెవెన్యూ, వ్యవసాయ శాఖలు
- ఆందోళనలో ఉమ్మడి జిల్లా రైతాంగం



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకం సందేహాలకు తావిస్తోంది. ప్రభుత్వం రైతుల ఖాతాల్లో సుఖీభవ పథకం నిధులను జమ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. కడప జిల్లా వ్యవసాయశాఖ 1,97,718 మంది రైతుల రిజిస్ట్రేషన్లు నమోదు చేసింది. రాష్ట్రంలోని కూటమి సర్కారు వెబ్‌ల్యాండ్ నమూనాను ప్రవేశపెట్టింది. గత వైసిపి సర్కారు ఇటువంటి నిబంధనలతో నిమిత్తం లేకుండా జిల్లా వ్యాప్తంగా 1,99,344 మంది రైతులకు రైతుభరోసా పథకం పేరుతో మూడు విడతలుగా రూ.13,500 చొప్పున నిధులను రైతు ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు చొప్పున విడుదల చేసిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి రైతుకు రూ.20 వేలు చొప్పున ఇస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. వైసిపి సర్కారు హయాంలో నాటి 1,99,344 మంది రైతుల సంఖ్యతో కూటమి సర్కారు 1,97,718 మంది పోల్చితే 1,626 మంది రైతుల ఖాతాలు గల్లంతు కావడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు చెల్లించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఇదేతరహాలో అన్నమయ్య జిల్లాకు చెందిన 1,95,781 మంది రైతులకు గాను 1,87,493 మందికి ఇకెవైసి పూర్తి చేసినట్లు తెలుస్తోంది. 2351 మందికి ఇకెవైసి తిరస్కరణకు గురికాగా 5,937 మంది రైతుల పేర్లు పెండింగ్ ఖాతాలో ఉన్నట్లు తెలుస్తోంది. వైసిపి సర్కారు హయాంలో రైతుల భూముల ఆన్‌లైన్ లోపాలు రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సరిదిద్దడం తెలిసిందే. కూటమి సర్కారు హయాంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖలు ఆన్‌లైన్ లోపాలను సరిదిద్దని పరిస్థితి కనిపిస్తోంది. పట్టాదారు పాస్ పుస్తకాల ఖాతాల సంఖ్య, ఒన్‌బిలను ఆన్‌లైన్ చేయడంలో రెవెన్యూ యంత్రాంగం అంతులేని నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. రాష్ట్రంలోని కూటమి డబుల్ ఇంజన్ సర్కారు చిత్తశుద్ధి కొరవడిన నేపథ్యం రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు రావడం ఖాయమని తెలుస్తోంది. రెవెన్యూ, వ్యవసాయ శాఖలు తన వంతు పాత్ర పోషించడంలో పరస్పరం పోటీ పడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సైతం సీరియస్‌గా తీసుకుని వైసిపి సర్కారు హయాంలోని 1,626 మంది లబ్ధిదారులకు న్యాయం చేయాలని, బ్యాంకింగ్ తదితర సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు రూ.21వేలు, రూ.24,500 ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కోశాధికారి గోపి డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్త ఆందోళన నేపథ్యంలో కడప ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.24,500 ఇవ్వాలని కోరుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచి రూ.25 వేలు ఉన్నా చిన్న ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మాట మార్చడం చాలా దారుణమని వాపోయారు. పర్మినెంట్ కార్మికుల మాదిరిగా ఆప్కాస్ ఉద్యోగులకు రిటైర్డ్‌మెంట్ వయస్సు 62 పెంచి బెనిఫిట్స్ రూ.75వేలతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. జులై4న విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. 4 తరువాత అత్యవసర సర్వీస్‌లు వాటర్, లైట్టింగ్ నిలిపి వేసి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద రావు, పర్మినెంట్ నాయకులు కొండయ్య, ఫిట్టర్ మహేశ్వర్ రెడ్డి, రాంమోహన్ రెడ్డి, ఆంజనేయులు, సుబ్బయ్య, గురువయ్య, శ్యాం బాబు, హరి నాయక్, సుబ్బయ్య, శరత్, బద్రి, జయపుత్రుడు, శివ, సత్యనారాయణ, బాల గంగయ్య, సోమిరెడ్డి, చిన్న, లైట్టింగ్, ప్రదీప్,హనుమంత్ రెడ్డి, అంజి, రామజనేయులు, రెడ్డయ్య,శివ రాజా. కార్మికులు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

ప్రతిభ చూపిన విద్యార్థులతో దౌలత్ ఖాన్, మసుద బేగం

ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్

హెలన్ కెల్లర్145వ జయంతి వేడుకలు హెలెన్ కెల్లర్స్ బదిరిలో ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలో కడపలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హెలన్ కెల్లర్ చిత్రపటానికి విద్యా సంస్థల జనరల్ సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ పి.దౌలత్ ఖాన్, ప్రిన్సిపల్, కో-ఆర్డినేటర్ మసూద బేగం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధిర విద్యార్థులు హెలన్ కెల్లర్ ను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. బధిర విద్యార్థులు నిరాశ నిస్పృహలకు గురికాకుండా కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో బధిర విద్యార్థులు, ఉపాధ్యాయులు, శిక్షణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** ఎందరో అభాగ్యుల జీవితాలలో వెలుగులు ప్రసాదించిన హెలెన్ కెల్లర్ చిరస్మరణీయురాలని, ఆమె దార్శనికతను స్ఫూర్తిగాతీసుకుని, బధిర విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రూరల్ సిఐ ఎన్. వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం బధిర వికలాంగుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ 145వ జయంతిని పురస్కరించుకుని, పట్టణంలోని ముద్దనూరురోడ్డులోఉన్న వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రూరల్ సిఐ, అవోపా సభ్యులతో కలిసి హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ ఆర్థిక సహకారంతో 30 మంది వికలాంగ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. అవోపా సేవాసంస్థ వారు వాటర్ క్యాన్లను పపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర కార్యదర్శి మేడా సాయిబాబా, పులివెందుల శాఖ అధ్యక్షులు దినేష్ గుప్తా, వాసవి క్లబ్ అధ్యక్షులు రొట్టెల వినోద్ కుమార్, అవోపా కార్యవర్గ సభ్యులు సత్యసాయి సుబ్రహ్మణ్యం, పద్మనాభయ్య, ఉమామహేష్ హరిబాబు, ఆర్. సుబ్రహ్మణం, వికలాంగుల సంఘ నాయకులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, ఆర్. వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

దళితులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి- కడప అర్బన్

కూటమి ప్రభుత్వం దళితులను దగా చేస్తుందని ఎస్‌సి సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌ఛార్జి ఆర్.ఎన్.రాజా పేర్కొన్నారు. శుక్రవారం ఎస్‌సి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జూలై 23న కడప నగరంలోని హరిత హోటల్‌లో నిర్వహించే ఎస్‌సి, ఎస్‌టిల చైతన్య వేదిక సభ కార్యక్రమానికి సంబంధించి డాక్టర్ బాబు జగ్జీవన్ రావు విగ్రహం ముందు పోస్టర్ల ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.యన్.రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో ఎన్నో ప్రభుత్వాలు మారుతున్న ఎస్‌సి, ఎస్‌టిల భవిష్యత్తుపై ఏ ప్రభుత్వమూ కృషి చేసిన దాఖలాలు లేవని తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తుట్లు పొడుస్తూ రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకుని ఉన్నాయని విమర్శించారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించండి : సిపిఎం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం : రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా స్మార్ట్ మీటర్లను బిగిస్తే అడ్డుకుంటామని, ప్రజలు కూడా వ్యతిరేకించాలని సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బ్రహ్మంగారిమఠం మండలంలో శుక్రవారం పాతూరు, అంబేద్కర్ నగర్, రవీంద్ర నగర్‌లోని ప్రతి ఇంటింటికి వెళ్లి స్మార్ట్ మీటర్ల వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించి స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించబోమని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చాక అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. లోకేష్ పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ఇచ్చిన పిలుపును మరిచిపోయారా అని ఆయన ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలపై రెండుసార్లు విద్యుత్ ఛార్జీల భారం దాదాపు రూ.15,454 కోట్లు మోపారని, ఇది దుర్మార్గమని ఆయన అన్నారు. ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు వెంటనే ఆపాలని, సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని, టైమ్ ఆఫ్ డే విధానాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గోవింద్, సుబ్బమ్మ, అజయ్, కార్యకర్తలు అరవింద్, దేవా పాల్గొన్నారు.

భూమి లీజుకు వేలం పాట

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం : బ్రహ్మంగారిమఠం మండలంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 486,487 సర్వే నెంబర్లలో ఉన్న 11 ఎకరాల 28 సెంట్లు భూమిని లీజుకు ఇచ్చేందుకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్య చారి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో తిప్పన మాధవ నాయుడు ఒక సంవత్సరానికి రూ. 3. 14 లక్షలకు లీజు అమౌంట్ చెల్లించి వేలంపాట దక్కించుకున్నారు.

భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి : జెసి

ప్రజాశక్తి - కడప : జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణ, అటవీ, పర్యావరణ అభ్యంతరాలు, లీగల్ క్లియరెన్స్ ప్రక్రియలను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని జెసి అధితి సింగ్ సంబందిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియ పెండెన్సీపై శుక్రవారం కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి సంబందిత అధికారులు, ఆయా మండలాల తహశీలర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగా బెంగుళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ చేపడుతోందని పేర్కొన్నారు. అందుకు సంబంధించి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు, అటవీ శాఖకు చెందిన పలు భూములను కొనుగోలు చేసి భూములు కోల్పోయినవారికి పరిహారం అందిస్తుందని చెప్పారు. తాజాగా కడప-రేణిగుంట నాలుగు లేన్ల జాతీయ రహదారికి ఫారెస్ట్ క్లియరెన్స్ లభించిందన్నారు. రోడ్డు విస్తరణ ప్రాజెక్టు పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, అనుమతులకు సంబంధించిన ఫైళ్లను రెవెన్యూ అధికారులు వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎదురయ్యే ఫారెస్ట్, పర్యావరణ అభ్యంతరాలు, సవాళ్లు, కోర్టు కేసులు సంబందిత అంశాలను దాదాపుగా అధిగమించామన్నారు. కార్యక్రమంలో ఎన్ హెచ్ఎఐ ఎస్‌డిసి వెంకటపతి, పీడీ అశోక్ కుమార్, ఆర్అండ్‌బి నేషనల్ హైవే ఇఇ విజయ్ భాస్కర్ రెడ్డి, ఎన్ హెచ్ ప్రాజెక్టుల ప్రనిధులు, ఫారెస్ట్, భూసేకరణ, రెవెన్యూ శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు బాసటగా ఐఎస్‌బి, బిల్ గేట్స్ ఫౌండేషన్

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజల పౌష్టికాహారం మెరుగుపరిచేందుకు ఐఎస్‌బి, బిల్ గేట్స్ ఫౌండేషన్స్ బాసటగా నిలుస్తున్నాయని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. ఎనాక్ట్ ప్రాజెక్ట్(ఇఎన్ఎసిటిఎస్) లో భాగంగా భారతీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) భాగస్వామ్యంతో జిల్లాలో పౌష్టికాహారం లోపం ఉన్న వారిని గుర్తించి పౌష్టికాహారం పెంపొందించడానికి కలెక్టర్ ఆధ్యర్యంలో ఆన్‌లైన్ జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐఎస్‌బి వారి ఆధ్వర్యంలో బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో జిల్లాలోని పౌష్టికాహార లోపంతో ఉన్న మహిళలకు పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్ అందించేందుకు ఎనాక్ట్ ప్రాజెక్ట్ ద్వారా అందిస్తామన్నారు. మొదటగా చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు మండలాలలో అమలుచేసి తర్వాత జిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. గ్రామీణ కుటుంబాలకు పోషక ఆహారాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి పోషక అంశాలపై భారతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సహకారంతో జిల్లాలో అధ్యయనం చేయనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా ఎనాక్ట్ ప్రాజెక్టులో సాంకేతిక మద్దతు ద్వారా పోషకార లోపం ఉన్న కుటుంబాలలోని మహిళలను పిల్లలను పిల్లలపై దృష్టి సారించి జిల్లాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న వారందరికీ పౌష్టికాహారం అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పౌష్టికాహార, ప్రోటీన్ ఆహార పదార్థాలను కొనలేని స్థితిలో చాలామంది ప్రజలు ఉన్నారని వారందరికీ అందుబాటులో సరసమైన ధరల్లో పౌష్టికాహారం బహుళ రంగ మార్కెట్ల ద్వారా ప్రజలకు అందించడానికి ఈ సంస్థలు కృషి చేస్తున్నాయని తెలిపారు. జిల్లాలో పోషకాహార లోపాన్ని తగ్గించడం, వివిధ మార్కెట్ల ద్వారా న్యూట్రిషన్ ఫుడ్‌ను అందుబాటులోకి తీసుకురావడం వంటి వాటిపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. పోషకాహారాన్ని అందించడానికి డిజిటల్ ఇ వోచర్లను కూడా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. డిజిటల్ ఓచర్లు ద్వారా న్యూట్రిషన్ ఫుడ్‌ను బయట మార్కెట్లో తక్కువ ధరకే పొందవచ్చునని తెలిపారు. రోజూ పాలు, గుడ్లు తీసుకోవడం పట్ల ప్రజల్లో అవగాహనను పెంచుతామని చెప్పారు. సేంద్రియ పద్ధతిలో పంట ఉత్పత్తులకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు .రాయలసీమ జిల్లాలలో కడప జిల్లాను లీడింగ్ హార్టికల్చర్ హబ్‌గా మార్చడంలో భాగంగా ఐఎస్‌బి సర్వేను ఉపయోగించుకొని పోషక విలువలు అధికంగా ఉండే పండ్ల తోటలపై దృష్టి సారించి న్యూట్రీషన్ ఆహార పదార్థాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

తాగునీటి పథకాలకు రూ.18 కోట్లతో ప్రతిపాదనలు

- జడ్‌పి సిఇఒ ఓబులమ్మ

పనులను పరిశీలిస్తున్న జడ్‌పి సిఇఒ ఓబులమ్మ

ప్రజాశక్తి-వేంపల్లె

జిల్లాలో తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు (సిపిడబ్ల్యుఎస్) సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం కింద రూ. 18 కోట్లుతో ప్రభుత్వాన్ని ప్రతిపాదనలు పంపినట్లు జడ్‌పి సిఇఒ ఓబులమ్మ పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో పారిశుధ్యం పనులను జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులతో కలిసి తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలను సందర్శించి తాగునీరు, ఇతర సమస్యలపై పాఠశాల ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. జడ్‌పికి చెందిన వాణిజ్య సముదాయ గదులను కూడ పరిశీలించారు. బాడుగలు చెల్లించని దుకాణాదారులను బకాయిలను చెల్లించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జడ్‌పికి చెందిన వాణిజ్య సముదాయాల నుంచి రూ. 10 లక్షలు మొండి బకాయిలు రావాల్సి ఉందని చెప్పారు. అందులో వేంపల్లెలో జడ్‌పి సముదాయ గదుల నుండి రూ.2 లక్షల రావాల్సి ఉందని చెప్పారు. ఇప్పటికే దుకాణాదారులకు బకాయిలు చెల్లించాలని నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. 10 రోజుల్లోగా బకాయిలు చెల్లించకపోతే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. జిల్లాలో 12 ఎంపిడిఒ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. వేంపల్లెలో పారిశుధ్యం చాలా అధ్వానంగా ఉందని చెప్పారు. ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శి మాధవరెడ్డికి ఆదేశించారు. జడ్‌పి బాలుర, బాలికల పాఠశాలలో నాడు - నేడు కింద అసంపూర్తిగా ఉన్న తరగతి భవనాలను ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు కూడ కల్పిస్తామన్నారు. ఆదాయం పెంచేందుకు జడ్‌పి వాణిజ్య గదులపై నూతన గదులను నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వాణిజ్య గదుల్లో ఉన్న దుకాణదారుల కోసం బాత్‌రూమ్‌లు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. వేంపల్లెలోని జడ్‌పి గదుల వెనుక వైపు అపరిశుభ్రత నివారించేందుకు మాంసం మార్కెట్ షెడ్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ మేరకు త్వరితగతిన అంచనా వేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో వంట గది నిర్మాణం చేపట్టాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి జడ్‌పి సిఇఒకు వినతి పత్రం అందజేశారు. దీంతో వంట గది నిర్మాణం చేపట్టాతానని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం బక్కన్నగారిపల్లెలోని పారిశుధ్య పనులను తనిఖీ చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆమె వెంట ఎంపిడిఒ కుళాయమ్మ, పంచాయతీ కార్యదర్శి మాధవరెడ్డి, ఎఇ గంగిరెడ్డి, ఎంఇఒ వెంకటరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు నాగాంజనేయులు, శివ మునెమ్మ, టిడిపి నేతలు వేమా కుమార్, మహమ్మద్ ఇనాయతుల్లా, డక్కా రమేష్, వైసిపి నేతలు ఆదినారాయణ రెడ్డి, సునీల్ తో పాటు అధికారులు పాల్గొన్నారు.

గండిక్షేత్రం ఇఒ అవినీతిపై విచారణ

- ప్రొటోకాల్ పాటించడం లేదంటూ సభ్యుల ఫిర్యాదు

ప్రజాశక్తి - చక్రాయపేట

విచారిస్తున్న కర్నూలు రేంజ్ డిప్యూటీ కమిషనర్

రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రంలో పనిచేస్తున్న ఆలయ కార్యనిర్మాణ అధికారి వెంకట సుబ్బయ్యపై అవినీతి, ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై దేవాదాయ శాఖ కర్నూలు రేంజ్ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురు ప్రసాద్ విచారణ చేపట్టారు. గండి క్షేత్రం చైర్మన్ కావలి కృష్ణ తేజ ఇటీవల గవర్నర్ నజీర్ అహమ్మద్‌కు గండి క్షేత్రం ఇఒ వెంకటసుబ్బయ్యపై ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు శుక్రవారం డిప్యూటీ కమిషనర్ గండి క్షేత్రానికి విచ్చేశారు. విచారణ చేసేముందు పాలకమండలి చైర్మన్ కృష్ణ తేజతో పాటు పాలకమండలి సభ్యులతో చర్చించారు. గండి క్షేత్రంలో నిర్వహించే కార్యక్రమాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను కూడా తనిఖీ చేశారు. కర్నూలు రేంజ్ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురు ప్రసాద్ గండి క్షేత్రానికి రావడంతో పాలకమండలి సభ్యులందరూ గండి ఇఒగా బాధ్యతలు చేపట్టే న్నప్పటినుండి ఇప్పటివరకు పాలక మండలి సభ్యులతో బోర్డు మీటింగ్ నిర్వహించకుండా వచ్చే ఆదాయాలను ఖర్చులను కూడా సభ్యులకు తెలపడం లేదని విన్నవించారు. అలాగే గండి క్షేత్రంలో జరిగే కార్యక్రమాలకు కూడా పాలకమండలి సభ్యులకు తెలపడం లేదని ఫిర్యాదు చేశారు. పాలకమండలి సభ్యులు కాకపోయినప్పటికీ కొందరి వ్యక్తులకు ఆయా కార్యక్రమాలకు పిలుస్తున్నారని చెప్పారు. శ్రావణమాస ఉత్సవాల్లోగా గండి శ్రీ వీరాంజనేయ స్వామి మూలవిరాట్‌ను దర్శనాన్ని భక్తులకు కల్పించకపోతే నిరాహార దీక్ష చేపడతామని కమిషనర్ ముందు జడ్‌పిటిసి శివప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. ఈ విచారణ కార్యక్రమంలో పాలకం మండలి చైర్మన్ కృష్ణ తేజ తోపాటు పాలకమండలి సభ్యులు గండి ఈవో వెంకటసుబ్బయ్య, దేవాదాయ సూపరిండెంట్ తిరుమల రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నివేదికలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్తాం

గండి క్షేత్రంలో పనిచేస్తున్న ఇఒ వెంకటసుబ్బయ్య పై అవినీతి ఆరోపణలో తేలితే కఠిన చర్యలు తప్పవని దేవాదాయ శాఖ కర్నూల్ రేంజ్ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గండి చైర్మన్ కృష్ణ తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టేందుకు గండికి వచ్చినట్లు తెలిపారు ఇరుగ్రూపులు ఇచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు ఒక నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపుతామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

బిటెక్ ఫైనల్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన యూనివర్సిటీ అనుబంధ సంస్థ ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల బిటెక్ ఫైనల్ సెమిస్టర్‌లో 99.30 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సిలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన బిటెక్ ఫైనల్ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం విసి తన ఛాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. జయరామి రెడ్డి, ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ. డీన్, ప్రొఫెసర్ కె. వెంకట రమణయ్య వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.ఎస్.వి. కృష్ణారావుతో కలసి ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ బిటెక్‌లోని ఆరు బ్రాంచ్‌లకు కలిపి 236 విద్యార్థులు పరీక్షలు రాయగా 234 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇద్దరు మాత్రమే ఫెయిల్ అయ్యారని తెలిపారు. 99.30 శాతం ఉత్తీర్ణత లభించిందని వివరించారు. సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్, సిఎస్‌సి బ్రాంచ్, ట్రిపుల్ ఇ బ్రాంచ్, ఎంఇ బ్రాంచ్, ఎంఎంటి బ్రాంచ్ లలో 100 శాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. ఇసిఇ విభాగంలో 95.70 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

సగిలేరు 'గురుకులం'ను తరలించడం దారుణం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం : బద్వేల్ నియోజకవర్గంలోని పోరుమామిళ్ల మండలం సగిలేరు గురుకులం పాఠశాలను బ్రహ్మంగారిమఠం మండలంలోని తోట్లపల్లి గ్రామం సమీపంలో మహా గురుకుల పాఠశాలకు తరలించడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దుల రాహుల్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 4,5 మండలాల విద్యార్థులు ఆ గురుకుల పాఠశాల మీద ఆధారపడి ఉన్నారని చెప్పారు. విద్యార్థులు అక్కడికి వెళ్లడం ద్వారా ఇబ్బంది పడతారని, వెంటనే యథావిధిగా సగిలేరు గురుకులం పాఠశాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ కొనేళ్లుగా ఎంతోమంది విద్యార్థులు అక్కడ చదువుకొని ఉన్న స్థాయికి చేరుకున్నారని చెప్పారు. పోరుమామిళ్ల, కలసపాడు వరికుంట్ల, బి.కోడూరు మండలాలు చుట్టుపక్కల అనేక గ్రామ ప్రజలు విద్యార్థులకు సగిలేరు గురుకులం పాఠశాల అనుకూలముగా ఉందన్నారు.

మోడల్ పరీక్షకు హాజరుకండి

ప్రజాశక్తి - కడప : ఐఎఎల్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షకు అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి. రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రవదన అన్నారు. శుక్రవారం బార్ అసోసియేషన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కడప బార్ అసోసియేషన్ హాల్‌లో ఈనెల 28న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భారత న్యాయవాదుల సంఘం (ఐఎఎల్) ఆధ్వర్యంలో నిర్వహించే జూనియర్ సివిల్ జడ్జ్ మోడల్ పరీక్షకు యువ న్యాయవాదులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ప్యాడ్ వెంట తెచ్చుకోవాలని ఐఎఎల్ జిల్లా నాయకులు సి. సుబ్రహ్మణ్యం, టీ. ఈశ్వర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కడప బార్ ఉపాధ్యక్షులు ఉమాదేవి, ట్రెజరర్ సురేష్, స్పోర్ట్స్ సెక్రటరీ చిన్నయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అద్భుత వారధి ఆర్ట్స్ కళాశాల

ప్రజాశక్తి - కడప : ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి విద్యార్థులకు ఉన్న అద్భుత వారధి ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ అన్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ పీజీ సెట్ 2025) ఫలితాలలో ఎం.కామ్ సబ్జెక్ట్‌లో కళాశాల విద్యార్థి ఎం. చిన్మయ వెంకట సాయి రాష్ట్రవ్యాప్తంగా మొదటి ర్యాంకును సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శుక్రవారం తన ఛాంబర్‌లో అభినందించారు. సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఆర్ట్స్ కళాశాలలో అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని కంప్యూటర్ ల్యాబ్, ఎన్‌సిసి, స్పోర్ట్స్, విశాలమైన ఆట స్థలం, అతిపెద్ద లైబ్రరీ సదుపాయం ఉందన్నారు. అదేవిధంగా ఏ కళాశాలలో లేని అత్యున్నత అర్హతలు గల అధ్యాపకులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని అన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ పిల్లలను ఆర్ట్స్ కళాశాలలో చేర్పించి పిల్లల బంగారు భవిష్యత్తుకు తోడ్పాటు అందించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్. రమేష్, ఎన్‌సిసి అధికారి డాక్టర్. నీలయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. శుక్రవారం మలేరియా సబ్ యూనిట్ అధికారిఆధ్వర్యంలో వేంపల్లిలోని 1వ సచివాలయం పరిధిలో 'ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటా లార్వా సర్వే నిర్వహించి మురుగు కాలువల్లో నిలిచిన నీటి నిల్వలను తొలగించి పరిసరాల శుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వృద్ధిని నివారించడానికి ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, ఫైలేరియాసిస్, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధులు వస్తాయని చెప్పారు. కాబట్టి దోమకాటుకు గురికాకుండా ప్రతి ఒక్కరు దోమ తెరలు వాడాలని సిద్దయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి బాబా ఫ్రక్రుద్దీన్, హెల్త్ సూపర్ వైజర్ అంకయ్య, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీదేవి, శిరీష, ఆశా కార్యకర్తలు జయమ్మ, కృష్ణవేణి, లక్ష్మీ నరసమ్మ , కుమారి పాల్గొన్నారు. **చెన్నూరు :** పారిశుధ్య పనుల పైన ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపిడిఒ కిరణ్ మోహన్ రావు అన్నారు. శుక్రవారం చెన్నూరులోని పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్మికులు గ్రామంలోని వీధుల్లోని చెత్తాచెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. చెన్నూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఇఒఆర్డి సురేష్ బాబుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో చెన్నూరు పంచాయతీ కార్యదర్శి రాంసుబ్బారెడ్డి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రైతులకు విత్తన మినీ కిట్లు : ఎఒ

ప్రజాశక్తి- సింహాద్రిపురం

ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులకు ఇస్తున్న మినీ కిట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కళ్యాణ్ కుమార్ సూచించారు. శుక్రవారం సింహాద్రిపురంలోని ఆర్ఎస్కెలో రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మినీ కిట్ల కింద జొన్నలు, రాగులు, కందులు అందజేస్తుందన్నారు. వీటిని అర్హత కలిగిన వారికి మాత్రమే అందజేయాలన్నారు. అదేవిధంగా ఖరీఫ్ సీజన్ సంబంధించి మండల యూనిట్‌గా ఉన్న వేరుశనగ ,పత్తి, చీని, అరటి రైతులు జులై 15 లోపల ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామం యూనిట్‌గా ఉన్న మినుము, జొన్న, కంది, పసుపు రైతులు , జిల్లా యూనిట్ గా ఉన్న ఉల్లి రైతులు జులై 31 లోపల ప్రీమియం చెల్లించాలన్నారు మరింత సమాచారానికి రైతులు రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్కె సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను పరిశీలించిన అడిషనల్ డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : పులివెందుల మెడికల్ కళాశాలను కడప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ రవిబాబు శుక్రవారం పరిశీలించారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ సౌజన్యను కలిసి టిబి, ఎయిడ్స్, లెప్రసీకి సంబంధించిన కేసుల గురించి, జాతీయ క్షయ నిర్మూలన, టిబి ముక్త్ భారత్ అభియాన్ ప్రచారం గురించి చర్చించారు. టీబీ యూనిట్, లెప్రసీ యూనిట్, ఎయిడ్స్ సురక్ష కేంద్రాలను సందర్శించి రికా ర్డులను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం బాక్రా పురంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఎఎన్ఎం, ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శాంతి కుమార్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి, ఎంపిహెచ్ఇఒ, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె : వేంపల్లెలోని గండి రోడ్డులోని నాగమ్మ నగర్ ప్రాంతంలో ఉన్న మదర్ థెరిసా అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆయాన్ బజాజ్ షోరూం యజమాని డాక్టర్ ఇబ్రహీం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం యజమాని కుమార్తె పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని నాగమ్మ నగర్‌లోని అనాథ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులు అందరికి అన్నదానంతో పాటు పండ్లు, బ్రెడ్‌ను కూడా అందజేశారు. తన కుమార్తె పుట్టిన రోజు వేడుకలను ప్రతి ఏడాది అనాథ వృద్ధుల మధ్య జరుపుకోవడం అనావాయితీగా పెట్టుకున్నట్లు డాక్టర్ ఇబ్రహీం తెలిపారు. అనాథ వృద్ధులకు ఒక పూట భోజనం పెట్టడం అనేది తన కుటుంబ సభ్యులు అందరికి చాలా ఆనందంగా ఉన్నట్లు చెప్పారు. పిల్లల ప్రేమాభిమానాలు లేని అనాథలకు చేయూత అందించాలనే సంకల్పంతో అన్నదానం కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు భాస్కర్ రెడ్డి, వృద్ధులు, ఆయాన్ బజాజ్ షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

కీచకులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కడప : పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తాలో ఈనెల 25న సౌత్ కలకత్తా లా కళాశాల ఆవరణలో ఇద్దరు విద్యార్థులు ఒక ఉద్యోగి కలిసి మూకుమ్మడిగా అదే కళాశాలలో చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారం చేయడం దారుణమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ శుక్రవారం విలేకరులకు వివరించారు. లా కళాశాలవిద్యార్థినిపై ఇలాంటి అత్యాచార ఘటనను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సారథ్యంలోని ప్రభుత్వం లా కళాశాల విద్యార్థినికి న్యాయం జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థినులు, మహిళలకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలని కోరారు.

వెండి వస్తువులు వితరణ

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక గాండ్ల వీధిలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యం దేవస్థానంలో వెలసిన సరస్వతి దేవి విగ్రహానికి పుల్లగూర గోవిందనాథ చటర్జీ అనే దాత వెండి ఆభరణాలను ఇచ్చారు. శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు శేషగిరిరావుకు వేంపల్లెలోని గాంధీ రోడ్డులో నివాసం ఉంటున్న పుల్లగూర గోవిందనాథ చటర్జీ, సతీమణి నాగమ్మ వెండి ఆభరణాలను అందజేశారు. లక్ష రూపాయల విలువ చేసే వెండి హస్తాలు, కర్ణాలు, బొట్టు, కళ్ళకు చెందిన వెండి ఆభరణాలను సరస్వతీ దేవి విగ్రహానికి అందజేసినట్లు దాత తెలిపారు. వెండి ఆభరణాలు ఇచ్చిన దాతలు ఇవ్వడంతో పాటు వేద మంత్రోచ్చారణతో శ్రీ సరస్వతి దేవికి అభిషేకం, కుంకుమార్చన, అస్టోత్తరా పూజలను చేయించారు.

ఎలక్ట్రికల్ స్కూటీ పేలి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

వెంకట లక్ష్మమ్మ (ఫైల్)

మండలంలోని పోట్లదుర్తి గ్రామంలో ఎలక్ట్రికల్ స్కూటీ పేలి శుక్రవారం తెల్లవారు జామున వృద్ధురాలు చెందింది. వివరాలు.. రెండు సంవత్సరాల కిందట ప్రదీప్ కుమార్‌రెడ్డి ఎలక్ట్రిక్ స్కూటర్‌ను కొనుగోలు చేశాడు. రోజు లాగా ఇంటి ఆవరణంలో గురువారం రాత్రి స్కూటర్‌కు ఛార్జింగ్ పెట్టాడు. ఛార్జింగ్ పెట్టాడు. అతడి తల్లి వెంకట లక్ష్మమ్మ (62) ఇంటి ఆవరణంలోనే గల సోఫాలో రోజులాగా నిద్రించింది. అది కేవలం ఎనిమిది అడుగుల వెడల్పుతో ఉన్న ప్రదేశం. గేటుకు, ఇంటికి తాళం వేసి ప్రదీప్‌తో పాటు అతని భార్య పిల్లలు మిద్దె పైన నిద్రిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో స్కూటీ బ్యాటరీ నుంచి పొగలు వస్తుండడం గమనించి వెంకటలక్ష్మమ్మ కేకలు వేసి కుటుంబ సభ్యులను పిలిచింది. మోకాలు నొప్పులు ఉండడం వల్ల ఆ సమయంలో ఆమె మెట్లు ఎక్కి పైకి వెళ్ల లేక పోయింది. పొగలు పెరిగినా ఎటు వెళ్లలేక ఆ వృద్ధురాలు విల విల్లాడి పోయింది. కుటుంబ సభ్యులు వచ్చేలోపు స్కూటీ పేలిపోయి వెంకటలక్ష్మమ్మ శరీరం పూర్తిగా కాలిపోయి చనిపోయింది. విషయం తెలిసి గ్రామస్తులు, వారి బంధు మిత్రులు శోక సముద్రంలో మునిగి పోయారు. ఈ సంఘ టనతో ఎలక్ట్రిక్ స్కూటర్లు ఉన్నవారు భయాందోళనలకు లోనవుతున్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: GOOTY
O.S. No: 34/2024

Between:
Cilla Nagalakshmamma ...Plaintiff
And
S.Muneer ...Defendant

ప్రతివాదికి నోటీసు

TO,
శ్రీ S.మునీర్ S/o పక్కీరప్ప, అంబకపల్లి గ్రామం, లింగాల మండలం, వైయస్సార్ కడప జిల్లా.
ప్రస్తుత నివాసం:
H.NO.100, N.P.S.Layout, Kengeri Satellite Town Bangalore City, Aadhar No.907309393762

పై దావాలోని ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 28-07-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకోవచ్చును. అట్లు హాజరు కాని యెడల పై దావా మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఎ.రామమోహన్ రెడ్డి,
వాదిపరం వకీలు, గుత్తి

మమల్ని బట్టలిప్పి నిలబెట్టారు

- కమిషనర్ పనిచేయకపోవడం వల్లే కేసులు
- పోలీసులు దారుణంగా ప్రవర్తించారు
- కమిషనర్‌ను ఎందుకు ప్రభుత్వానికి సరెండర్ చేయకూడదు
- కౌన్సిల్ సమావేశంలో చైర్మన్, కౌన్సిలర్ల ప్రస్తావన

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వరప్రసాద్, హాజరైన కౌన్సిలర్లు, అధికారులు

ప్రజాశక్తి-పులివెందులటౌన్

కౌన్సిలర్లను బట్టలిప్పి నిలబెట్టారని, కమిషనర్ పనిచేయకపోవడం వల్లే కౌన్సిలర్‌పై కేసులు పెట్టి పోలీసులు దారుణంగా ప్రవర్తించారని, మున్సిపల్ కమిషనర్‌ను ప్రభుత్వానికి ఎందుకు సరైన చేయకూడదని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మహానాడు సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు పులివెందుల పట్టణంలోని కూడళ్ళలో వైఎస్ఆర్ విగ్రహం చుట్టూ విగ్రహాలు కనిపించకుండా టిడిపి పార్టీ జెండాలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. వీటిని తీయించవలసిందిగా కమిషనర్‌తో పాటు పోలీసులకు కూడా తెలియ జేశామని అయితే వారు స్పందించకపోవడం వల్ల అనేక సమస్యలు చోటుచేసుకున్న యన్నారు. కేవలం జెండాలు తీయమన్నందుకు అధికారులు స్పందించక పోవడం వల్లనే వైసిపి కార్యకర్తలు వెళ్లి ఆ జెండాలను తీసివేశారని పేర్కొన్నారు. పులివెందుల మున్సిపల్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు వైఎస్ఆర్‌సిపి కార్యకర్తల అటెంప్ట్ మర్డర్ కేసులను నమోదుచేసి అత్యంత దారుణంగా హింసించారని మున్సిపల్ చైర్మన్ పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లను గౌరవప్రదంగా చూడాల్సింది పోయి పోలీసులు బట్టలు విప్పి మరి నిలబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కోర్టు ముందు కూడా తెలియజేశామని ఆయన తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారి కూడా సరిగా పనిచేయకపోడం వల్లనే ఈ సమస్యలన్ని వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాముడు స్పందిస్తూ ముందుగా సభ తనను క్షమించాలని పేర్కొన్నారు. మహానాడు సందర్భంగా తనకు ఉన్నతాధికారులు విధులు నిర్వహించేందుకు వెళ్లమని చెప్పారని, అందువల్ల మహానాడు కార్యక్రమంలో ఉన్నందువల్ల తాను తన కింది స్థాయి అధికారులకు వీటిని తీయించవలసిందిగా తెలియజేశానని పేర్కొన్నానని, అయితే వారు వీటిని తీయించేందుకు కోసం పోలీస్ అధికారులను సంప్రదించారని చెప్పారు. పోలీసులు కూడా మహానాడులో ఉన్నందువల్ల వారి స్పందించలేదని అందువల్లని ఆ జెండాలను తీయించలేకపోయాం అన్నారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ వైస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిలర్లపై టిడిపి నాయకులు కేసులను బనాయించడం చాలా దారుణమైన విషయమన్నారు. కేవలం కౌన్సిలర్లు కాకుండా ఎనిమిది, పది తరగతుల చదివే విద్యార్థులపై కూడా అటెంప్ట్ మర్డర్ కేసులు పెట్టడం చాలా విచారకరమన్నారు. కౌన్సిలర్లు, చిన్నారుల వద్ద ఎటువంటి మారణాయుధాలు లేకున్నప్పటికీ కూడా వారిపై అటెంప్ట్ మర్డర్ కేసులను పోలీసులు నమోదు చేశారని ఇది చాలా దారుణం అన్నారు. కౌన్సిల్ ఈ సంఘటనపై తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిస్తుందని ఆయన తెలిపారు. అలాగే దీనిపై మానవ హక్కుల కమిషన్‌తో పాటు ఎస్‌సి, ఎస్‌టి కౌన్సిల్ కూడా వెళ్తామని చైర్మన్ పేర్కొన్నారు కార్యక్రమంలో తహశీల్దార్ నజీర్ అహ్మద్, హౌసింగ్ ఎఇ రామసూరారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ఆస్తికి భద్రత కరువైంది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులో ప్రజల ఆస్తికి భద్రత కరువైందని, నకిలీ పత్రాలతో కాజేసే వ్యక్తులు ఉన్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక దొరసాని పల్లె లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కొన్ని రోజుల నుంచి మండలంలోని కొత్తపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ఎంపిపి శేఖర్ యాదవ్ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి, ఆ భూమి తమదంటూ అర్ధరాత్రివేళ అక్కడి నిర్మాణాలను తొలగించే యత్నం చేశారన్నారు. 1985లో ఆ భూమిని ఆ కౌన్సిలర్ బంధువులు కొన్నట్టు, 1980లో ఆ భూమికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ వారి బంధువుల పేరుతో సృష్టించారని వివరించారు. ఈ తతంగం మొత్తం కొత్తపల్లి పంచాయతీ కార్యాలయంలో చోటు చేసుకుందని స్పష్టం చేశారు. ఈ భూమిని ఒక వ్యక్తి వద్ద దాదాపు రూ. 25 లక్షలకు తనఖా పెట్టడంతో పాటు, మరో వ్యక్తి వద్ద అడ్వాన్స్ తీసికొని విక్రయించారని తెలిపారు. కాగా ఈ భూమి డాక్యుమెంట్ వున్న వ్యక్తి కి ఆ భూమి అతని జననానికి ముందే ఎలా సంక్రమిస్తుందని ప్రశ్నించారు. ఈ నకిలీ డాక్యుమెంట్లు, సీల్, అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసిన వ్యక్తులకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కుమారుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి అభయం ఉందని అందువలనే పోలీసులు వారి పైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.ఈ విషయంలో ఎస్‌పిని కల్పించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి శేఖర్ యాదవ్, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, రాగుల శాంతి, మన్నె సత్యం, గరిశపాటి లక్ష్మీదేవి, నాగేంద్ర రెడ్డి, పాతకోట మునివంశీధర్ రెడ్డి, అనిల్, గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ బీరం రాఘవేంద్ర రెడ్డి, మండల వైసిపి అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థినికి ట్రిపుల్‌ఐటిలో సీటు

ప్రజాశక్తి - వల్లూరు : మండల పరిధిలోని గంగాయపల్లి ఆదర్శ పాఠశాలలో చదువుతున్న పిట్టు నందిని ట్రిపుల్‌ఐటీలో సీటు వచ్చింది. శుక్రవారం ప్రిన్సిపల్ మాట్లాడుతూ మండల పరిధిలోని వెంకటేశా పురానికి చెందిన నందిని ఆదర్శ పాఠశాలలో చదువుతూ పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 576 మార్కులు సాధించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపల్ విద్యార్థిని తల్లిదండ్రులు అభినందించారు. ఇంకా ఉన్నత స్థాయి చదవాలన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ అభ్యున్నతే లక్ష్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

నిడివిలగల సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభ్యున్నతే తమ లక్ష్యమని ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపల్ తాతాజీని నర్సీపట్నంకు బదిలీ చేశారు. శివశంకర్ స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రిక్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తన సేవలను అంకితం చేస్తానని తెలిపారు. విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాల పెంపుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. అనంతరం కాలేజీ సిబ్బంది అందరూ ప్రిన్సిపాల్ గారిని సాలువ కప్పి సత్కరించారు.

మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖాధికారి పి.రవింద్రబాబు

ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్‌పై శిక్షణ

ప్రజాశక్తి - వేముల

ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్- 2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ సభాభవనంలో ఉద్యాన శాఖ, ఎం.కె. అగ్రోటెక్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఉద్యాన అధికారి పి.రవిచంద్రబాబు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వి.శశిభూషణ్ రెడ్డి, ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి, బిజెపి కిసాన్ మోర్చా సంఘ జిల్లా అధ్యడు రమణారెడ్డి, టిడిపి మండల నాయకుడు పేర్ల శేషారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేయాలనుకునే రైతులను ఉద్యాన శాఖ ద్వారా మొక్కలు నాటుకోవడానికి రూ. 29 వేలు ,4 సంవత్సరాల పాటు మొక్కల నిర్వహణకు రూ. 5,250, అదేవిధంగా హెక్టారుకు సంవత్సరానికి అంతర పంటలు వేసుకోవడానికి రూ. 5,250 ఈ విధంగా హెట్టారుకు సబ్సిడీ ఇస్తామని చెప్పారు. పులివెందుల నియోజకవర్గంలో లింగాల, పులివెందుల, వేముల మండలలోఆ యిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉంటాయని చెప్పారు. రైతులు మొక్కలు నాటే సమయంలో మొక్కకి మొక్కకి మధ్య 9 మీటర్ల దూరంతో నాటుకోవాలని తెలిపారు. మార్క్ ఫెడ్ డైరెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూనె నిచ్చే పంటలను అధికంగా ప్రోత్సహిస్తుందని ఆయిల్ ఫామ్ పంట సాగు విరివిగా సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఎం.కె ఆగ్రోటెక్ కంపెనీ ప్రతినిధి రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం వేముల పొలంలోని ఈశ్వర్ రెడ్డి తోటలో జిల్లా ఉద్యానవన అధికారి ఆయిల్ ఫామ్ మొక్కను నాటి వేముల మండలంలో ఆయిల్ ఫామ్ సాగును ప్రారంభించారు. కార్యక్రమంలో మండల రైతు సేవా కేంద్రాల అసిస్టెంట్లు, వేముల మండల రైతులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధి కోసమే గ్రామ కమిటీలు

ప్రజాశక్తి-కాశినాయన : గ్రామాలలో టిఆడిపి అభివృద్ధి కోసమే గ్రామాలలో కమిటీ వేస్తున్నామని మండల తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ ఉమాకాంత్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన నరసాపురంలోని కల్యాణ మండపంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మొదట మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో, 2029 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ బలోపేతం కావాలంటే గ్రామాలలో గ్రామ కమిటీల నుంచి పార్టీ అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పని చేయాలని ఆయన తెలి యజేశారు. కార్యక్రమంలో బసిరెడ్డి రవీంద్రారెడ్డి, పోల్ రెడ్డి కృష్ణారెడ్డి, ముడమల రమణారెడ్డి, కొండ నరసింహారెడ్డి, లక్ష్మిరెడ్డి, నర్సాపురం ఆయకట్టు ప్రెసిడెంట్ సంజీవ రాయుడు, టిడిపి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వయం కృషితోనే ఉన్నత శిఖరాలు

- జిఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్ గోపాలి శ్రీనివాసులు

ప్రజాశక్తి-కడప సిటీ

స్వయంకృషితోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జిఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్ (ఎల్ఎ) గోపాలి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈనెల 30న ఆయన ఉద్యోగ విమరణ చేయనున్న నేపథ్యంలో కలిసిన సందర్భంగా తన మనోగతాన్ని ఆవిష్కరించారు. 1963 సంవత్సరంలో కర్నూలు జిల్లా కోసగి గ్రామంలో గోపాలి అల్లయ్య, గోపాలి లక్ష్మమ్మ దంపతులకు జన్మించానని తెలిపారు. కోసగి గ్రామంలోనే ఒకటి నుంచి పదవ తరగతి వరకు విద్యాభ్యాసం సాగిందన్నారు. 1978 నుంచి 1980 వరకు ఆదోనిలోని ఆర్ట్స్అండ్ సైన్స్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశానని తెలిపారు. 1980 నుంచి 1983 వరకు అనంతపురం ఆర్ట్స్ కళాశాలలలో డిగ్రీ, 1984 నుంచి 1986 వరకు శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ అనంతపురంలో ఎం.ఎ ఎకనామిక్స్ పూర్తి చేశానన్నారు. 1987 వరకు 1994 వరకు గ్రూప్స్‌కు ప్రిపేరయ్యా నని తెలిపారు. 1995 గ్రూప్ -2ఎ ద్వారా డిప్యూటీ తహశీల్దార్‌గా అనంతపురం కలెక్టరేట్‌లో ప్రొబేషనరీ ఉద్యోగ బాధ్యతలను స్వీకరించా నన్నారు. 1996లో పుట్టపర్తిలో ఆర్ఓఆర్ అధికారిగా విధులు నిర్వర్తించానని తెలిపారు. 1996 నుంచి 2023 వరకు సూపరింటెండెం ట్‌గా అనంతపురం జిల్లా కొత్తచెరువు మండలంలో విధులు నిర్వహించానన్నారు. 2003 నుంచి 2005 వరకు అనంతపురం జిల్లా డిఎస్ఒ కార్యాలయంలో సిఎస్‌డిటిగా, 2005లో ఉద్యోగోన్నతిపై 2007 వరకు అనంతపురం జిల్లా చెట్లూరు మండల తహశీల్దార్‌గా పని చేశానని తెలిపారు.2007 నుంచి 2009 వరకు రామగిరి మండలానికి బదిలీపై వెళ్లానన్నారు. 2009 నుంచి 2011 వరకు కుందుర్పి మండలం తహశీల్దార్‌గా విధులు నిర్వహించానని చెప్పారు. 2011 నుంచి 2013 వరకు అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలానికి బదిలీపై వెళ్లి విధులు నిర్వహించానని తెలిపారు. 2013 నుంచి 2014 వరకు ఆరాపురం మండలానికి బదిలీపై వెళ్లాల్సి వచ్చిందన్నారు. 2014లో ఉద్యోగోన్నతిపై చిత్తూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా డిఆర్‌డిఎలో అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ (ల్యాండ్)గా బాధ్యతలు స్వీకరించానని తెలిపారు. 2015 నుంచి 2023 వరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్, ఎ పెన్నార్ అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ స్టేజ్-2 విభాగంలో పని చేశా నన్నారు. 2023 నుంచి 2024 వరకు కుప్పం ఆర్‌డిఒగా పని చేశానని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హోదాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడంతో మరుపు రాని జ్ఞాపకంగా నిలిచిందన్నారు. 2024లో బదిలీపై జిఎన్ఎస్ఎస్ ల్యాండ్ అక్విషన్ కడప స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తూ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ తన 30 ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో దళితులు, బడుగు, బలహీన వర్గాలకు నిస్వా ర్థంగా రెవెన్యూ సేవలు అందించానని తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాలు, ఇళ్లపట్టాలు, ప్రొవిజన్ సర్టిఫికెట్లు, భూపంపిణీ, డికెటి పట్టా లను మంజూరు చేశానని తెలిపారు. ఉద్యోగ జీవితంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా వ్యవహరించానన్నారు. అనంతపురం, కడప జిల్లా కలెక్టర్లు, ఇన్‌ఛార్జి మంత్రుల చేతుల మీదుగా పలు ప్రశంసాపత్రాలను అందుకున్నానని తెలిపారు. ప్రస్తుత కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓల సహకారం అందించానని చెప్పారు.

హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న సంక్షేమాధికారి జ్యోతి

వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- సింహాద్రిపురం

విద్యార్థులు బిసి హాస్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని పులివెందుల సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని హిమకుంట్లలో బిసి బాలుర వసతి గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం వసతి గృహాలను ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులు ఇలాంటి వసతి గృహాలను సద్వినియం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. మాజీ జడ్‌పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ హిమకుంట్ల జిల్లా పరిషత్ పాఠశాల కార్పొరేట్ స్థాయిలో విద్యా వసతులు ఉన్నాయన్నారు. హిమకుంట్ల పాఠశాలకు చాలా గ్రామాల నుంచి విద్యార్థులు బస్సులు, ఇతరత్రా వాహనాలలో చాలా కిలోమీటర్లు ప్రయాణం చేసి వస్తున్నారని అన్నారు. అలాంటి విద్యార్థులకు రోజూ పోవడం, రావడం కష్టంగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఉన్నతాధికారులు గుర్తించి బిసి హాస్టల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. హాస్టల్ వార్డెన్ ఉమర్ ఫరూక్ మాట్లాడుతూ హాస్టల్లో మరింత మంది విద్యార్థులు చేరేందుకు అవకాశం ఉందన్నారు. పేద విద్యార్థులు హాస్టల్లో చేరి చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నల్లపురెడ్డి పల్లె, పులివెందుల హాస్టల్ వార్డెన్లు వెంకట్ రెడ్డి, మోహన్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొలంలో 8 అడుగుల కొండ చిలువ

ప్రజాశక్తి - ముద్దనూరు

జమ్మలమడుగు రహదారిలోని జగనన్న కాలనీ సమీపంలో రైతు వేణు గోపాల్ రెడ్డి పొలంలో శుక్రవారం 8 అడుగుల కొండ చిలువ కనిపించింది. కొండ చిలువ కోడిని మింగడంతో కదల్లేని స్థితిలో ఉంది. గమనించిన రైతు దానిపైన మట్టి పోశారు. దాంతో కొండ చిలువ కదల్లేక మట్టి కింద ఉండిపోయింది. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో డిఆర్ఒ శ్రీనివాసులు, సిబ్బందితో వచ్చి కొండ చిలువను పట్టుకుని అడవిలో వదిలేశారు.

పాఠశాలకు మంచి పేరు తేవాలి

ప్రజాశక్తి- ఖాజీపేట : విద్యార్థులు కష్టపడి చదివి ప్రభుత్వానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర పరిశీలకులు ప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ ఏడాదికి సంబంధించి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ ఎఎంఒ విశ్వనాథరెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు నాగ స్వర్ణలత, నాగరాజు, కో-ఆర్డినేటర్ రమణమూర్తి, ఎంఆర్సిసి సిబ్బంది వెంకటేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి- ఖాజీపేట

దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్

స్థానిక కోటం గురువాయపల్లెలో టిడిపి మండల నాయకులు నెల్లూరప్ప యాదవ్ ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ నూతన దుకాణాన్ని శుక్రవారం ఎమ్మెల్యే వుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ యువత కూడా స్వశక్తితో జీవించాలని, అందుకు ప్రభుత్వం సాయం చేస్తుందన్నారు. రాయితీ రుణాలు అందజేయనుందని ఆయన పేర్కొన్నారు.

రేషన్ బియ్యం తూకాల్లో మోసాన్ని నివారించాలి

ప్రజాశక్తి - వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే రేషన్ బియ్యం తూకాలల్లో డీలర్లు బకెట్లు పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా కో- కన్వీనర్ దాదా పీర్ కోరారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తహశీల్దార్ హరినాథ్‌రెడ్డికి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు రేషన్ బియ్యం పంపిణీపై వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా వేంపల్లెలో రేషన్ బియ్యం పంపిణీ చేసే డీలర్లు పేదల బియ్యంలో కూడా కోతలు విధిస్తున్నారని చెప్పారు. డీలర్లు తూకాలు వేసే సమయంలో ప్లాస్టిక్ బకెట్లులో బియ్యం వేసి తూకాలు వేయడం వల్ల 25 కిలోలకు, మూడు కిలోలు తక్కువ వస్తుందన్నారు. ప్రజలు తీసుకొని వెళ్లిన సంచుల్లోనే బియ్యం వేసి తూకాలు వేసే విధంగా డీలర్లుకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రజల కళ్లు ముందే దోపిడి జరుగుతున్నా ఏమి చేయని నిస్సహాయ స్థితిలో ప్రజలు ఉన్నారని చెప్పారు. వయస్సు పైబడిన వారికి వేలి ముద్రలు పడక పోయిన బియ్యం సరఫరా చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఇచ్చిన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి తూకాలలో మోసం చేస్తే అలాంటి డీలర్లపై చర్యలు తీసుకొంటామని తహశీల్దార్ నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు గౌస్, షఫి, అహమ్మద్ పాల్గొన్నారు.

'నా బిడ్డలకు న్యాయం చేయండి'

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : మరొక మహిళతో ఉంటూ, డబ్బు, నగలు అన్ని తీసుకెళ్లి తన భర్త మోసం చేశాడని, తన బిడ్డలను అనాథలుగా వదిలేశారని, వారికి న్యాయం చేయాలని స్థానిక మహేశ్వర్‌నగర్‌కు చెందిన సర్వర్ణలత శుక్రవారం మీడియా ఎదుట వాపోయారు. తనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. వృత్తి రీత్యా వ్యాపారి అయిన తన భర్త జైపాల్ రెడ్డి చిత్తూరు జిల్లా పలమనేరు గ్రామంలో ఇంకో మహిళతో ఉంటూన్నాడని వాపోయారు. తనకు తెలియకుండా ఇంట్లో ఉన్న డబ్బు, నగలను తీసుకొని వెళ్ళిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తనకు, తన బిడ్డలకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే పిల్లలను పోషించలేక తన పిల్లలతో సహా ఆత్మహత్యకు పాల్పడక తప్పదన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి

ప్రజాశక్తి - చాపాడు : పంచాయతీ కార్యదర్శులపై పని భారం తగ్గించాలని, వివిధ రకాల యాప్ లతో ఇబ్బందికి గురవుతున్నామని పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు. శుక్రవారం చాపాడు ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త సేకరణలో భాగంగా ప్రభుత్వం ఐవిఆర్ఎస్ అభిప్రాయాలను సేకరిస్తుందన్నారు. ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించేందుకు ఉదయం 6 గంటలకే చెత్త బండ్ల వెంబడి పంచాయతీ కార్యదర్శులు వెళ్లి అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం ఇబ్బందికరంగా ఉందన్నారు. తాగునీటికి సంబంధించిన మోటర్లు వాటి నిర్వహణ ఆర్‌డబ్ల్యుఎస్ శాఖకు అప్పగించాలన్నారు. వీధిలైట్లు వాటి నిర్వహణ ఎనర్జీ అసిస్టెంట్లకు అప్పగించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ బాధ్యతలను తొలగించి కేవలం గ్రామ పంచాయతీ పర్యవేక్షణ అప్పగించాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల జిల్లా యూనియన్ ఆదేశాల మేరకు శనివారం సామూహిక సెలవు పై వెళుతున్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు కార్యాలయ ఎఒ రామానుజంకు సామూహిక సెలవుకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, చంద్రశేఖర్, వేణు, శ్రీనివాసులు, జ్యోత్స్న, సురేష్ పద్మావతి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONBLE JUNIOR CIVIL JUDGE AT :: PULIVENDULA
O.S.No. 36 OF 2021

M. Madhu Sudhan Reddy , S/o. M. Gurvi Redddy, Aged about 55 Years, Residing at. D.NO. 4/8/206, Chava Subhakar Reddy Colony, Pulivendula town & mandal, YSR Kadapa district. ... Plaintiff
Vs
K. Naga Kumari W/o K. Vengal Reddy, Age about 50 years, Hindu, Residing at. Backside of Sarswathi mandir, Rajeev Gandhi Colony, Nagarigutta, Pulivendula town & mandal, YSR Kadapa district .... Defendant

Notice

Whereas the plaintiff filed suit for recovery of money before the Hon'ble Junior Civil Judge, Pulivendula Vide O.S.NO. 36 of 2021 and the same is posted for the your appearance on 30-06-2025, all of you hereby directed to appear before the Hon'ble court at 10:30 A.M in person or through your counsel or advocate, otherwise the petition may be decided in your absence.

BY ORDER OF THE COURT
R. CHANDRA OBULA REDDY
Advocate for the petitioner
 # 42/347-101, Upstairs,
Road No: 4, Simhapuri Colony,
Kadapa-516002.
Cell No: 6300943720